

ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీని కూల్చివేసిన అధికారులు

ప్రభుత్వ స్థలంలో నిర్మాణం కూల్చివేత

కొత్తపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ మండల పరిధిలోని కొత్తపేట డివిజన్ శృంగేరికాలనీలోని సర్వే నెం.135లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీ, అక్రమ నిర్మాణాన్ని పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు శనివారం రాత్రి కూల్చివేశారు. 500 చదరపు గజాల సదరు ప్రభుత్వ స్థలంలో ప్రహరీ నిర్మించారని శనివారం ఉదయం స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆర్ఐ అశ్విని, అధికారులు, స్వామి, వెంకన్న, విజయలక్ష్మి సిబ్బంది అదే రోజు రాత్రి అక్రమ నిర్మాణాలను కూల్చేశారు. వారు వెళ్లిన తర్వాత కబ్జాదారులుగా భావిస్తున్న వారు అక్కడ రెండు రేకుల కంటేనర్ గదులను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ అశ్విని, సిబ్బందితో వచ్చి జేబీబీతో రెండు రేకుల కంటెయినర్ గదులను ధ్వంసం చేశారు ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆర్ఐ అశ్విని చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కాలనీ అధ్యక్షుడు మనోజ్‌కుమార్

కాలనీలో డెయిరీ ఫామ్ ఏర్పాటు చేయొద్దు

వనస్థలిపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాలనీలో డెయిరీ ఫామ్ (పశువుల కొట్టం) ఏర్పాటు చేస్తే సహించేది లేదని గాయిత్రినగర్ ఫేస్-4 కాలనీ అధ్యక్షుడు గౌరిశెట్టి మనోజ్‌కుమార్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయిత్రినగర్ ఫేస్-4 కాలనీలో ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ఆలపాటి నాగేశ్వర్ రావు (దుబాయ్ రాజు) అనే వ్యక్తి మరో వ్యక్తితో వేరే కాలనీలో నిర్వహిస్తున్న రాజా డెయిరీ ఫామ్‌ను తమ కాలనీలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోందని, కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సదరు వ్యక్తి దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. డెయిరీ ఫామ్‌ను ఏర్పాటు చేస్తే కాలనీలో దోమల బెడద పెరుగుతుందన్నారు.

టీఎస్ఎస్ఏ గ్రేటర్ అధ్యక్షుడిగా నాగరాజు

చాదర్‌ఘాట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ గ్రేటర్ అధ్యక్షుడిగా మేడి నాగరాజును నియమిస్తూ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మలక్‌పేటలోని కార్యాలయంలో మేడి నాగరాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 22న వరంగల్‌లో నిర్వహించే విద్యార్థి యుద్ధభేరి మహాసభను విజయవంతం చేసేందుకు విద్యార్థులు పెద్దఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్స్, గురుకులాల విద్యార్థుల సమస్యలను నిర్మూలించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దఎత్తున ఉద్యమం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్, వేణు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నాగరాజుకు నియామకపత్రం అందజేస్తున్న మహేష్‌కుమార్ తదితరులు



సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

వనస్థలిపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీనివాసకాలనీ నూతన కమిటీ సభ్యులు కార్పొరేటర్ లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరుతు వినతిపత్రం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చిత్తరంజన్, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, సైదులు, అరుణ, రామ్‌నాయక్, చరణ్‌సింగ్, శేఖర్ పాల్గొన్నారు.

గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దశరథగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 17(ఆంధ్రజ్యోతి): గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బుర్ర దరశథగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కుంట్లూర్‌లోని గాంధీయన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో దశరథగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి నియామకపత్రాన్ని దశరథకు అందజేశారు. తన సేవలను గుర్తించి పదవి బాధ్యతలను అప్పగించిన రాజేందర్‌రెడ్డితో పాటు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి, సుభాష్‌చంద్ర, చైతన్యరెడ్డి, సూర్యతేజనాయుడు, శ్రీకాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



దశరథగౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాజేందర్‌రెడ్డి

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 4కే వాకథాన్

ఎల్బీనగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నడక ప్రాధాన్యతను తెలిపి ఆరోగ్యాన్ని పెంపొందించుకునే విధంగా ప్రజల్ని చైతన్యం చేయాలనే లక్ష్యంతో వాసవీ కాలనీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 4కే వాకథాన్ చేపట్టారు. ఈ వాకథాన్‌లో వాసవీకాలనీకి చెందిన మహిళలు, పురుషులు, పిల్లలతో పాటు సీనియర్ సిటిజన్స్ పెద్దఎత్తున పాల్గొని నడక ప్రాధాన్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాధధీరజ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు, వాసవీకాలనీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గౌరిశెట్టి అరుణ్‌కుమార్, కార్యదర్శి తమ్మన శ్రీధర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ చైర్మన్ తమ్మన లక్ష్మీ సుజాత, ఒరుగంటి లక్ష్మీ, పూసర్ల లక్ష్మీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.



పారిక్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సమితి సభ్యులు

దేశాన్ని విశ్వగురువుగా మార్చడమే లక్ష్యం

సైదాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని విశ్వగురువుగా మార్చడమే అందరి లక్ష్యం కావాలని వీహెచ్‌పీ అఖిల భారత ప్రముఖ్ అజయ్ కుమార్‌పారిక్ అన్నారు. చంపాపేట కృష్ణానగర్‌లోని కారుణ్యసింధు అనాథాశ్రమం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం వినయ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. మానవసేవయే మాధవసేవయని అందరూ తనకున్న దానిలో పేదవారికి సాయం చేయాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి మాట్లాడుతూ చిన్నారులు తాము అనాథాలమన్న భావనను దూరం చేసుకుని చదువు సాగించాలని కోరారు. కార్యక్రమానికి కరుణశ్రీ సేవా సమితి అధ్యక్షుడు ఆచార్య కడారిసత్యమూర్తి అధ్యక్షత వహించగా ప్రధాన వక్తగా హిందూ సంపాదకులు కసిరెడ్డి వెంకటరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ తెలంగాణ అధ్యక్షుడు నర్సింహ్మమూర్తి సమితి కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వర్‌రావు, జి.జైపాల్ రెడ్డి, గుర్రం సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కనువిందు చేయనున్న క్లాక్ టవర్

- రూ.1.60కోట్ల వ్యయంతో నిర్మాణం
- ఆకట్టుకుంటున్న డైనోసార్, జీరాఫీల బొమ్మలు

చాదర్‌ఘాట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్‌లోని ఆజంపుర చమన్‌లో నిర్మించిన క్లాక్‌టవర్ చూపరులకు ఆకట్టుకుంటోంది. సుమారు రూ.1.60 కోట్ల వ్యయంతో నిర్మించిన క్లాక్ టవర్ త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఆజంపుర డివిజన్‌లోని ఆజంపుర చమన్ గతంలో తాగుబోతులు, బిచ్చగాళ్లకు అడ్డాగా ఉండేది. అయితే ఆజంపుర ఆర్‌యూబీకి మరో వెంట్ నిర్మించిన తర్వాత రోడ్డు విస్తరణ చేపట్టాల్సి వచ్చింది. ఈ మేరకు ఆజంపుర చమన్‌ను కుదించడంతో పాటు క్లాక్ టవర్‌ను నిర్మించాలని నిర్ణయించారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తన బడ్జెట్ నుంచి రూ.1.60 కోట్ల నిధులను మంజూరు చేయించారు. 2023లో నవంబరులో శంకుస్థాపన చేశారు. దీంతో ఆజంపుర ఆర్‌యూబీ మరో వెంట్‌ను సుందరీకరణ చేసేందుకు చర్యలు చేపట్టారు.





చౌరస్తాలో ఏర్పాటు చేసిన క్లాక్ టవర్, డైనోసార్

● రూ.40లక్షలతో వర్టికల్ గార్డెన్

రెండు వెంట్‌లతో కూడిన ఆజంపుర ఆర్‌యూబీని వర్టికల్ గార్డెన్‌తో తీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ మలక్‌పేట అర్బన్ ఫారెస్ట్ విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని మెట్రో పిల్లర్‌కు నిర్మించిన తరహాలోనే రెండు వెంట్‌లతో కూడిన ఆజంపుర ఆర్‌యూబీని తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు పచ్చదనం పెంచేలా చేపట్టే చర్యల్లో భాగంగా ఆర్‌యూబీ రెండు వెంట్‌ల ప్రహరీలకు మొక్కలను అమర్చేందుకు చిన్నచిన్న డబ్బాలను అమర్చుతున్నారు. ఆర్‌యూబీ రెండు వెంట్‌ల ప్రహరీలపై చూపరులను ఆకట్టుకునేలా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిచేలా తీర్చిదిద్దుతున్నారు.

● ఆకట్టుకుంటున్న వన్యప్రాణులు ప్రతిమలు

మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో ఇది వరకు కేటిల్ నుంచి కప్ సాసర్‌లోకి టీ పోస్తున్నట్లుగా ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేయగా తాజాగా వన్యప్రాణులు నడిచి వస్తున్నట్లుగా డైనోసార్, జీరాఫీల బొమ్మలను ఏర్పాటు చేశారు. అవి అటుగా వెళ్లే ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోనే రెండు జిరాఫీలు నడుస్తున్నట్లుగా ఏర్పాటు చేశారు. మరోవైపు డైనోసర్ రోడ్డుపై నుంచి వెళ్లే వారిపై దూకడానికి సిద్ధంగా ఉన్నట్లుగా ఏర్పాటు చేసి అందరి చూపులను ఆకట్టుకునేలా చేశారు.



మలక్‌పేట చౌరస్తాలోని ఆకర్షణీయంగా జిరాఫీలు



మంత్రితో కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయండి

వనస్థలిపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. ఆదివారం మంత్రి శ్రీధర్ బాబు నివాసంలో కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసి డివిజన్ సమస్యలను వివరించారు. ఈ సంద్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వనస్థలిపురంలోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి డివిజన్ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. మంత్రి సానూకూలంగా స్పందించారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహాపడిపూజ

చంపాపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ డిఫెన్స్ కాలనీలోని హరిహరక్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం రాత్రి ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పదునెట్టాంబడి మహాపడిపూజను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మాలాధారణ స్వాములతో ఆలయం అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగింది. ఈ పడిపూజలో జగద్గురు శంకరాచార్య హంపీ పీఠాధుపతులు విద్యారణ్య భారతి స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు రంజిత్‌తంత్రి, రమణ గురుస్వామి ఆధ్వర్యంలో మహాపడిపూజ నిర్వహించారు.



భక్తిశ్రద్ధలతో మహాపడిపూజ

జాతీయ స్కూల్ గేమ్స్‌కు తన్మయి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు హైదరాబాద్‌కు చెందిన 10 మంది చెస్ ప్లేయర్లు ఎంపికయ్యారు. నగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. బాలికల విభాగంలో తన్మయి, శ్లోక, రితిక, రవళిక, ఆస్మా, బాలుర కేటగిరీలో బాసిక్, సాయి, విరించి, అమర్‌నాథ్, మార్టిన్ జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న తన్మయి

నాదర్‌గుల్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 27వ డివిజన్‌లోని శ్రీరామ ఎన్‌క్లేవ్ ఫేజ్-2 కాలనీలో ఆదివారం సాయి శ్రీనివాస ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరూ ఆరోగ్యం పట్ల జాగ్రతగా ఉండాలని సూచించారు. అనంతరం ఆమె బీపీ చెక్ చేయించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, బంగారి అశోక్, డాక్టర్ రాఘవేందర్‌రావు, వైద్య బృందం పాల్గొన్నారు.



వనస్థలిపురం డివిజన్ శ్రీకృష్ణ నగర్‌కాలనీలో సుమారు 24 లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుట్ల నర్సింహ్మా యాదవ్ తదితరులు.

- వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

పంచలోహ విగ్రహాల అపహరణ

సరూర్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప పడిపూజలో ఉపయోగించిన పంచలోహ విగ్రహాలు అపహరణకు గురయ్యాయి. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కీసర నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డినగర్ సమీపంలోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో పునర్నిర్మాణంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కొందరు అయ్యప్ప స్వాములు పడిపూజ నిర్వహించారు. పూజలో అయ్యప్ప, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి పంచలోహ విగ్రహాలు తెచ్చి పూజలు చేవారు. అనంతరం రాత్రి 11.30 గంటల తర్వాత అందరూ ఇంటికి వెళ్లారు. పూజారి, వంట మనిషి, స్వీపర్ అక్కడే నిద్రపోయారు. కాగా గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి తర్వాత ఆయా విగ్రహాలను అపహరించుకుపోయినట్టు గుర్తించి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.



విగ్రహాలు చోరీ కావడంతో ఖాళీగా ఉన్న దృశ్యం

ఇంటికొచ్చేదాకా ఆపుకోవాల్సిందేనా?

- బాలాపూర్ బాలికల పాఠశాలలో టాయిలెట్లు లేక అవస్థలు
- డిప్యూటీ మేయర్‌కు గోడు వెళ్లబోసుకున్న ఓ తల్లి

సరూర్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'సార్.. నా బిడ్డ రోజూ స్కూల్‌కు పోయి సాయంత్రం ఇంటికొచ్చే దాకా ఉగ్గబట్టుకుంటోంది.. అదేమని అడిగితే స్కూల్‌లో బాత్‌రూమ్‌లు లేవు. ఉన్నవి కూడా వాడడానికి వీలు లేకుండా ఉన్నాయని అంటుంది సార్.. మీరైనా ఈ పరిస్థితిని అధికారులు వివరించి తగు చర్యలు తీసుకునే విధంగా చూడండి' అంటూ ఓ తల్లి ఆవేదన. ఇది బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక తల్లి ఆవేదన. పాఠశాలలో టాయిలెట్స్ సరిగా ఉండడం లేదని, సాయంత్రం దాకా చిన్నారులు టాయిలెట్స్‌కు వెళ్లకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌కు ఫోన్‌లో వివరించింది. కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో బాలబాలికలకు టాయ్‌లెట్స్ లేకపోవడంతో మూత్రవిసర్జనకు వారంతా పడరాని పాట్లు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించడంలేదు. స్కూల్‌లో టాయిలెట్స్ లేకపోవడంతో నేటికీ ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలు ఉదయం ఇంట్లో మూత్ర విసర్జన చేసి, మళ్లీ సాయంత్రం ఇంటికెళ్లేదాకా ఉగ్గ పట్టుకుని ఉంటున్నారు.





బాలాపూర్ ప్రభుత్వ స్కూల్, ఇన్‌సెట్‌లో అపరిశుభ్రంగా టాయిలెట్స్

నీరు సైతం తాగడం లేదు

టాయ్‌లెట్స్ సమస్య కారణంగా బాలికలు పాఠశాలలో ఉన్నంత సేపు మంచినీరు కూడా తాగడం లేదు. నీరు తాగితే బాత్‌రూమ్‌కి వెళ్లాల్సి వస్తుందనే భయంతో.. స్కూల్‌లో బాత్‌రూమ్‌లు లేనందున నీరు తాగడం లేదని పలువురు బాలికలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

టాయిలెట్స్‌కు వెళ్లకపోవడంతో కడుపు నొప్పి, ఇతర ఇబ్బందులు వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ దగ్గకు వెళ్తే.. మంచినీరు తాగకపోవడం, మూత్ర విసర్జన చేయకపోవడమే ప్రధాన కారణంగా చెప్పినట్టు ఆమె పేర్కొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్కూల్‌లో టాయిలెట్స్ నిర్మించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11 కేవీ హుడాసాయినగర్, సౌత్‌ఎండ్ పార్క్, దుర్గనగర్, గ్రీన్‌హిల్స్, ఆంధ్రకేసరి, హనుమాన్‌నగర్, లెక్చరర్స్‌కాలనీ ఫీడర్ల పరిధిలోని చెట్ల నరికివేత, నిర్వహణ పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హుడాసాయినగర్, సౌత్‌ఎండ్ పార్క్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉ.10.30 నుంచి 12.30 గంటల వరకు, దుర్గనగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, 11 కేవీ గ్రీన్‌హిల్స్, ఆంధ్రకేసరి ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, 11 కేవీ హనుమాన్ నగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, 11 కేవీ లెక్చరర్స్‌కాలనీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

ఏపీ సీఎం చంద్రబాబు సోదరుడి మృతికి తీగల సంతాపం

సరూర్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం బాబు సోదరుడు నారా రామ్మూర్తినాయుడి మృతి పట్ల మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఏపీకి వెళ్లి రామ్మూర్తి మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



టీటీడీ బోర్డు సభ్యుడికి సన్మానం

టీటీడీ బోర్డు సభ్యుడిగా నియామకమైన మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి యాదవ్‌ను లిబర్టీలోని టీటీడీ దేవస్థానంలో ఆదివారం తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.మార్త రమేష్ సన్మానించారు. అఖిల భారత యాదవ్ మహాసభ నాయకులు ఎం.గోపాల్‌యాదవ్, బి.కృష్ణయాదవ్, జూలూరి గౌరీశంకర్, హనుమాన్ కేసరిగౌడ్, ఎం.వి.ఎస్.నికేతన్‌కుమార్ యాదవ్, నోబుల్ సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు

- 14 సెంటర్లలో 3,375 మంది హాజరు, 2,457 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ సత్యనారాయణరెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద బ్రిలియంట్ కాలేజీ సెంటర్ వద్ద అభ్యర్థులు

హయత్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 14 సెంటర్‌లలో గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచే అభ్యర్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. 8.30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. 9.30 తరువాత అనుమతించబోమని అధికారులు ప్రకటించడంతో అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మొదటి సెషన్ ఉదయం 10 నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. హయత్‌నగర్‌లోని 14 సెంటర్లలో మొత్తం 5,832 మంది అభ్యర్థులకు 3,375 మంది హాజరయ్యారు. 2,457 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలకే సెంటర్ల గేట్లను మూసివేశారు. రంగారెడ్డి కలెక్టర్ సత్యనారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డిలు హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్, తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాలలోని సెంటర్‌ను సందర్శించి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండడంతో హయత్‌నగర్ పోలీసులు ఆయా పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తీని ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రంలోనికి వెళ్లిన అభ్యర్థుల నుంచి నిర్వాహకులు బయోమెట్రిక్ తీసుకున్నారు. షూస్, వాటర్ బాటిళ్లు, సెల్‌ఫోన్‌లు, రిస్ట్‌వాచ్‌లు, బ్యాగులను అనుమతించలేదు.

● అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో...

అబ్దుల్లాపూర్‌మెట్: నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్‌లో గ్రూప్-3 పరీక్షల మొదటి సెషన్‌లో 8,580 మంది అభ్యర్థులకు గాను 4,911 మంది హాజరు కాగా 3,669 మంది గైర్హాజరయ్యారు. సెకండ్ సెషన్‌లో 8,580కి గాను 4,878 పరీక్షలు రాయగా, 3,702 మంది గైర్హాజరయ్యారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డితో కలిసి సందర్శించారు.



బ్రిలియంట్ కాలేజీ సెంటర్ వద్ద ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు



వర్డ్ అండ్ డీడ్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సత్యనారాయణరెడ్డి, అధికారులు

● బాలాపూర్ మండలంలో...

సరూర్‌నగర్: గ్రూప్-3 పరీక్షలు బాలాపూర్ మండలం అల్మాస్‌గూడలోని ఆర్కా ఇంటర్నేషనల్ స్కూల్, మీర్‌పేట్‌లోని టీఆర్ఆర్ కాలేజీలో సెంటర్లలలో పరీక్షలు నిర్వహించారు. ఆర్కా స్కూల్‌లో 432 మంది అభ్యర్థులను కేటాయించగా 261 మంది, టీఆర్ఆర్ కాలేజీకి 480 మంది అభ్యర్థులను కేటాయించగా 288 మంది హాజరయ్యారు.

● దిల్‌సుఖ్‌నగర్‌లో 13 సెంటర్లు

చాదర్‌ఘాట్: కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు నడుమ గ్రూప్-3 పరీక్షలు దిల్‌సుఖ్‌నగర్‌లోని 13 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా పూర్తయ్యాయి. మలక్‌పేట పీఎస్ పరిధిలోని 13 కేంద్రాల్లో 5,860 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేయగా కేవలం 30 శాతం మందే హాజరైనట్లు అధికారులు తెలిపారు.